


సింహాద్రి మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చేడు. గదిలో చుక్క ముక్కు చీదుతూ కూర్చుని వుంది. ఏందేఇయ్యాలేమొచ్చింవేగల్లపేడు స్తా కూర్చున్నావ్, జల్దీ బువ్వెట్టు అత మెద కట్టేసి కుప్పలు పెట్టి ఒచ్చినం బువ్వ తినెల్లి కూలి వడ్లు కొట్టుకో వాల. ఆలస్యంచేస్తే ఏ దొంగ నాయా లో కట్టలు వేసుకపోతడు లే—లే... మా యమ్మ గదూ! నేలమీద కండువ పరచి కూర్చున్నాడు. కొద్దిసేపలాగే కూర్చున్నాడు. చుక్క రా లే దు. విసుగ్గా లేచాడు.

"ఏందే ఈ యేలప్పుడు ఈ ..డు పేంది. ఎవరు చచ్చింరని ఏడవడం, నేను జల్దీ పోవాల్నని చెప్పినా ఆమాత్తరం గేనం లేకుంటే ఎట్ల నువ్వు పెడ్తవా నన్ను పెట్టుక తినమన్నవా" చుక్క బదులు పలకలేదు. "ఓ ఎదవ సంత! ఎదవ కొంప" అక్కడే కంచం పెట్టుకొని,

వడ్డించుకొని త్వర త్వరగా తిని పొలం వెళ్లాడు. తండ్రి అటు పొలం వెళ్ళగానే ఆ కంచంలోనే అన్నం తింది. కంచం తియ్య బుద్ధి కాలేదు.. అలాగే కూర్చుండి పోయింది. గుమ్మం అవతలవున్న కుక్క వచ్చి కంచం నాకింది. "ఎదవముండ ఎల్లు బయటికి" కంచం కుక్క మీదికి విసరింది. కుయ్యోమంటూ పరుగెత్తింది కుక్క.

ఆలోచనలు చుక్క మెదడులో సుళ్ళు తిరుగుతున్నాయి.

మొన్న పటేలు బండిలో పట్నంవెళ్లి సినిమా చూసినప్పటినుండీ తనకెలాగో వుంది. అందులో ప్యాంటూ, పొడుగు చేతుల చొక్కా వేసుకొన్న బుల్లోడు ఎన్టీవోడనీ ఇద్దరు ఆడవాళ్లని మాటి మాటికీ ప్రేమ ప్రేమ అని కావులించుకొంటాడు. ఆ సినిమాలో ఇద్దరు ఆడవాళ్లు పల్లెలోనే వుంటారు. ఇద్దరు సిల్కు చీరెలు కట్టుకుని కాళ్ళు తడవకుండానే పొలంలో నాట్లు పెడతారు. వడ్లు దంచుతారు. వంగకుండా. చీర అంత బిగుతుగా ఒంటికి అతుక్కుపోయేలా కట్టి గోచీ కట్టకుండా నాట్లు వేయడానికి పొలంలో ఎలా వంగుతారో అర్థం కాలేదు చుక్కకి. ఆ ఇద్దరు ఆడవాళ్ళలో ఒకామె చివరికి ఏడుస్తూ పాట పాడి రెండో ఆమెని కౌగిలించుకుని ఎన్టీవోడి చేతిలో చెయ్యి కలిపి ఎందుకు చచ్చిపోయిందో అంతకన్నా అర్థం కాలేదు. అంత సినిమాలోనూ చుక్కకి 'ప్రేమ' అన్న విషయం ఒక్కటే నచ్చింది. మాటి మాటికీ 'ప్రేమ ప్రేమ' అనుకుంది మనస్సులో. 'ప్రేమ' అంటే ఏమిటీ అని పటేలుగారి పని మనిషి నడిగితే నాకేం తెలుసు పొమ్మంది. ఆఖరున పాట పాడుతూ ఎన్టీవోణ్ణి గట్టిగా కౌగిలించుకుంది వాణిశ్రీ అని పటేలుగారి పని మనిషి చెప్పింది అడక్కుండానే. మొత్తం సినిమాలో రంగు రంగుల బట్ట వేసుకుని పాటలు పాడుతూ కౌగిలించుకొనే ఎన్టీవోడ్ని ఎన్నోసార్లు మెచ్చుకుంది. అలాంటోణ్ణి ప్రేమించాలనుకుంది. తను వాణిశ్రీలాగే వుంటాననుకుంది. ఆ సినిమా చూసినప్పటినుండీ గోచీ పెట్టడం మానివేసింది. పూసల సైరింటికివెళ్లి ఆరణాల అద్దం తెచ్చుకుంది. మాటి మాటికీ గుండ్రటి, పొడగాటి చుట్ట పెట్టుకుని, తల పిగలు చుట్టుకుని అద్దంలో చూసుకొంటూ వాణిశ్రీ కన్నా బావుంటుందా అనుకునేది. చివరికి వాణిశ్రీ కన్నా తానే అందంగా వుంటానని తేల్చుకుని ఎన్టీవోడిలా ఊళ్లో ఎవరన్నా వాళ్ళని ప్రేమించాలనుకుంది. పటేలు కొడుకొక్కడే అలా వుంటాడు. ఎన్టీవోడిలా వుండడు. కానీ ఆ వూళ్ళో ప్యాంటూ, పొడుగు చేతుల చొక్కా వేసుకొనేది అతనొక్కడే. ఓసారి వాళ్ళింటి బావికి నీళ్ళకెడితే ఎవరూ లేకుండా చూసి తన చెయ్యి పట్టుకొన్నాడు.

''చుక్కా. నా పువ్వులచొక్కా. తొలి వలపుల మొక్కా నువు లేకుంటే నా బ్రతుకే ఎండు మొక్కా'' అని మాటల పాట పాడేడు. అదేమీ అర్థం కాకపోయినా సరదాగా అనిపించింది చుక్కకి. 'నిన్నే ప్రేమిస్తున్నాను, నీవు లేని జీవితం ఎడారి బాట' అన్నాడు, ఏడుపు మొహంపెట్టి. ''ప్రేమ'' అన్న ముక్క మాత్రం